సాక్షి
కాకినాడ
సోమవారం । 3 । జూన్ । 2024



## వకుళమాత అన్నదాన భవనానికి రూ.50వేలు

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి అంకం గిరి బాబు (నర్సీపట్నం) రూ.50 వేల విరాళం అందించారు.



## నారసింహ సుదర్శన హోమంకు రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది నరసన్న ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంకు కె.శ్రీనివాస్‌కుమార్, పద్మావతి దంపతులు (కైకలూరు) రూ.లక్ష విరాళం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
37.0° / 25.6°

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రాజమహేంద్రవరం | 37.0 | 27.0 |
| కాకినాడ | 31.1 | 25.6 |
| అమలాపురం | 36.0 | 29.0 |

## న్యూస్‌రీల్

### లోవకు పోటెత్తిన భక్తులు

రూ.5.07 లక్షల ఆదాయం



లోవలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వాతావరణం చల్లగా ఉండడంతో వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు లోవకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక, సర్వదర్శనాల క్యూ ల ద్వారా 15వేల మంది భక్తులు తలుపులమ్మ తల్లిని దర్శించుకున్నట్టు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,31,485, పూజా టికెట్లకు రూ.1,37,190, కేశఖండనశాలకు రూ.25,080, వాహన పూజలకు రూ.4,200, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.79,012, విరాళాలు రూ.30,341లు కలిపి రూ.5,07,308 ఆదాయం సమకూరిందని తెలిపారు.

### భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణం



కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

కాకినాడ సిటీ: స్వచ్ఛమైన పర్యావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత మనదని జిల్లా అటవీ సంరక్షణ అధికారి ఎస్.భరణి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ వీబీఆర్ చారిటబుల్ ఫౌండేషన్, పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు నిర్వహించారు. రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు పర్యావరణంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి 318 మంది విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అటవీ సంరక్షణ అధికారి ఎస్.భరణి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉంటే భూమిపై జీవ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. వృక్ష సంపదను అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, ఏఎఫ్‌సీ పాఠశాల ప్రధానోధ్యాయలు నేతల నూకరాజు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎం.నాగార్జున, వైల్డ్‌లైఫ్ బయాలజిస్ట్ డి.మహేష్‌బాబు, జిల్లా సమన్వయకర్త కేవీకే మహేశ్వర రావు, క్లస్టర్ సమన్వయకర్తలు వీఎస్‌వీ రమణ మూర్తి, పిల్లి గోవిందరాజులు, ఎస్.వీరభద్ర రావు, గణిత అవధాని పి.రవిశంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### డెల్టా కాలువలకు 2,500 క్యూసెక్కుల నీరు

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 2,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 500, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 1,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. 3,197 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90అడుగుల వద్ద నీటి మట్టం నెలకొంది.

### కోటసత్తెమ్మ ఆలయం కిటకిట

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోట సత్తెమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,54,512 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

# పవరిఫుల్

- ఖరీఫ్‌కు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేలా ఏర్పాట్లు
- పగటి పూట తొమ్మిది గంటల సరఫరా
- ముమ్మరంగా కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల పనులు
- మొత్తంగా 55వేల వ్యవసాయ కనెక్షన్లు



మెట్ట ప్రాంతంలో విద్యుత్ బోరుపై సాగు చేస్తున్న వరిపైరు

సాక్షిప్రతినిధి, కాకినాడ: కేరళలో నైరుతి రుతుపవనాల ప్రవేశంతో చినుకు కోసం ఎదురుచూస్తోన్న మెట్ట ప్రాంత రైతుల్లో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. ఈ సీజన్‌లో విద్యుత్ బోర్లపై ఆధారపడి సాగుచేసే రైతులకు పగటి పూట నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సంబంధిత శాఖ కసరత్తు పూర్తి చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యధికంగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతంలో వ్యవసాయ బోర్లు ఆధారంగా వరి సాగు జరుగుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి, గోపాలపురం, మండపేట తదితర నియోజకవర్గాల్లో అత్యధికంగా వ్యవసాయ బోర్ల ఆధారంగానే ఖరీఫ్ సాగు జరుగుతోంది. ఇందుకు తగ్గ ఏర్పాట్లు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే ప్రభుత్వం చేస్తుంటుంది. బోర్లపై సాగయ్యే పొలాలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో రైతులకు నిర్దిష్టంగా సమాచారం ఉండేది కాదు. ఈ కారణంగా పంట సాగుకు రైతులు నానా కష్టాలు ఎదుర్కొనేవారు. అందునా వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ కూడా రాత్రి పూట మాత్రమే ఇచ్చేవారు. అటువంటి పరిస్థితిని చక్కదిద్దిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతు పక్షపాతిగా రైతుల తలరాతలు మార్చేలా పగటి పూట నిరంతరాయంగా తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. రాజశేఖరరెడ్డి రాజకీయ వారసుడిగా అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదే ఒరవడిని కొనసాగించి జిల్లాలో రైతుల విద్యుత్ కష్టాలను గట్టెక్కించారు.

**అదనంగా 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్లు**

పూర్తిగా మెట్ట ప్రాంతమైన జగ్గంపేట డివిజన్ పరిధిలో వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందజేసేందుకు ఏపీఈపీడీసీఎల్ పకడ్బందీగా చర్యలు తీసుకుంది. హంసవరంలో 132 కేవీ నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను రూ.24.64 కోట్లు వెచ్చించి మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలు, గృహ అవసరాలకు ఇప్పుడున్న విద్యుత్ సామర్థ్యం సరిపోదనే ముందుచూపుతో సర్కిల్ పరిధిలో రూ.84.14 కోట్లు వెచ్చించి అదనంగా 33/11కేవీ 28 ఇంటర్ లింకింగ్ లైన్లను ఏర్పాటు చేశారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో ఎనిమిది, రాజమహేంద్రవరం అర్బన్‌లో ఒకటి, కాకినాడ డివిజన్‌లో ఆరు, అమలాపురం డివిజన్‌లో మూడు, రామచంద్రపురం డివిజన్‌లో రెండు, జగ్గంపేట, పెద్దాపురం డివిజన్‌ల పరిధిలో నాలుగేసి అదనపు సబ్ స్టేషన్లను నెలకొల్పారు. విద్యుత్ సరఫరాలో లైన్‌లాస్‌లను తగ్గించి లోపాలను చక్కదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో రెండు, అమలాపురంలో మూడు, జగ్గంపేటలో ఒకటి మొత్తంగా ఆరు అదనపు సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు రూ.34.75 లక్షలు వెచ్చించారు. కాకినాడ డివిజన్ పరిధిలోరూ.11.23 లక్షల వ్యయంతో సబ్‌స్టేషన్ విస్తరణ చేపట్టారు. సర్కిల్ పరిధిలో రూ.59.55 లక్షలు వెచ్చించి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచారు.

**అడిగిన ప్రతి రైతుకూ కనెక్షన్**

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విద్యుత్ సర్కిల్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో అడిగిన ప్రతి రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశారు. గత ఏడాది మార్చి 31 వరకూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 51,92 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ఈ ఏడాది కొత్తగా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న 2,604 మంది రైతులకు అడిగిన వెంటనే మంజూరు చేశారు. మొత్తంగా సర్కిల్ పరిధిలో 53,996 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటన్నింటికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే దిశగా ఏపీఈపీడీసీఎల్ యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసింది. మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న తరుణంలో ఎక్కడా ఏ ఒక్క రైతుకు ఇబ్బంది లేకుండా ముందుగానే నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సబ్‌స్టేషన్‌ల సామర్థ్యం పెంచి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. గతంలో వ్యవసాయంతో పాటు ఇతర రంగాలకు కలిపి ఉన్న విద్యుత్ లైన్‌లను విభజించి వ్యవసాయానికి ప్రత్యేకంగా లైన్‌లు వేశారు. రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, రామచంద్రపురం, జగ్గంపేట తదితర డివిజన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి 220/133/33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్‌లను ఏర్పాటు చేశారు.

### నిరాటంకంగా సరఫరాకు ఏర్పాట్లు



**ఖరీఫ్ సీజన్‌లో సాగుకు** ఎటువంటి ప్రతిబంధకాలు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నాం. **వ్యవసాయానికి పగటి**పూట తొమ్మిది గంటల పాటు నిరాటంకంగా సరఫరా చేసేందుకు **ప్రత్యేకమైన ఏర్పాట్లు** చేశాం. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచాం. బోర్లపై ఆధా**రపడ్డ ఏ ఒక్క ఎకరంలో**ను సాగుకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయనున్నాం.

– టీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏసీబీ ఎస్పీ రామ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీబీ ఎస్పీ రామ్మోహన్

పిఠాపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీబీ ఎస్పీ రామ్మోహన్ హెచ్చరించారు. ఆయన వివిధ పార్టీలకు సంబంధించిన గ్రామాల నాయకులతో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 18 గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించామని ఆయన తెలిపారు. ఇప్పటికే 506 మందికి 143 నోటీసులు జారీ చేశామన్నారు. 107 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని జూన్ ఆరో తేదీ వరకు యాక్ట్ ఆఫ్ ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ప్రకారం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున, ఎక్కడ కూడా గుమిగూడి ఉండడం గానీ, సంబరాలు చేసుకోవడం గాని చెయ్యరాదని ఆయన హెచ్చరించారు. కౌంటింగ్ రోజు టపాసులు పేల్చడం గాని, రోడ్డుపై అనవసరంగా తిరగడం గాని చేయకూడదని ఏసీబీ ఎస్పీ రామ్మోహన్ హెచ్చరించారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోదర్, సీఐ శ్రీనివాస్, పలువురు రాజకీయ పార్టీల నేతలు, పోలీసులు పాల్గొన్నారు.

### సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 108 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ నెల 6వ తేదీన 1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకూ గల విద్యార్థులు సర్టిఫికెట్లు పరిశీలనకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్




మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందని ప్రశాంత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమం ఆదివారం కాకినాడలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్తు సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కాకినాడ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, రాజేష్ జోగ్‌పాల్‌తో కలిపి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్, జాయింట్ కలెక్టర్, పిఠాపురం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి హాజరయ్యారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, వీవీ ప్యాడ్స్ స్లిప్పుల కౌంటింగ్, రీ కౌంటింగ్, రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడి చేసే విధానం, ప్రత్యేక సందర్భాల్లో వ్యవహరించాల్సిన విధానం తదితర అంశాలపై సిబ్బందికి ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణ చివరి దశకు చేరుకుందన్నారు. ఓట్ల లెక్కింపు అనేది ఎన్నికల ప్రక్రియ అంతటిలో అత్యంత ముఖ్యమైన దశ అని పేర్కొన్నారు. జేఎన్టీయూలో ఈనెల 4న నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందన్నారు. ఈనేపథ్యంలో ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఈసీఐ మార్గదర్శకాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎటువంటి సందేహం లేకుండా ప్రతి దశలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ని నియమిస్తామన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి పి.త్రినాథ్, జెడ్పీ డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, ఎన్నికల సిబ్బంది, జిల్లా నోడల్ అధికారి పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

**కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**


జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా కౌంటింగ్ ఏర్పాట్లపై ఆదివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నివాస్ పాల్గొని మాట్లాడారు. కౌంటింగ్ ఏర్పాట్లను సీఈవోకు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాల్స్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి కౌంటింగ్ హాలులో 28 టేబుల్స్ ఉంచామన్నారు. వాటిలో 14 టేబుల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి, 14 టేబుల్స్ పార్లమెంట్ నియోజవర్గానికి కేటాయించామన్నారు. పోలైన ఓట్ల సంఖ్యను అనుసరించి 15 నుంచి 19 రౌండ్ల వరకు కౌంటింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 200 మీటర్ల వరకు రెడ్‌జోన్‌గా ప్రకటించామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో బందోబస్త్ ఏర్పాట్లు చేశామన్నారు. మీడియా సెంటర్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఇతర సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లను, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా జనరేటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్లు అనుమతించవద్దని, రౌండ్ల వారీగా కచ్చితమైన ఫలితాలను నిర్దేశించిన ఫారం ప్రకారం ఎన్నికల కమిషన్‌కు నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు.

## వైభవంగా సహస్రగళ చాలీసా పారాయణ

అమలాపురం టౌన్: సామూహిక హనుమాన్ చాలీసా పారాయణతో లోక కల్యాణం సిద్ధిస్తుందని పశ్చిమ గోదావరి జిల్లా శృంగవృక్షం శ్రీదత్త పీఠం ఐదో పీఠాధిపతి, విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ మార్గదర్శి శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం జరిగిన సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ మహా యజ్ఞాన్ని పీఠాధిపతి నాగానంద సరస్వతి ప్రారంభించి ఉపన్యసించారు. స్వామీజీతో పాటు ఉత్తర కాశి, హిమాలయాల నుంచి వచ్చిన శ్రీస్వామి సూర్య భాస్కరేంద్ర సరస్వతి, అంబాజీపేట మండలం వక్కలంకకు చెందిన వాసుదేవానంద స్వామీజీ, వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని హనుమ వైభవాన్ని వివరించారు. తొలుత వేదికపై ప్రతిష్ఠించిన హనుమ విగ్రహానికి పట్టణానికి చెందిన ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ప్రయోగ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. సంగీత కళాకారుడు మట్టపర్తి చంద్రశేఖర్ బృందం సంగీత వాయిద్యాల నడుమ చాలీసా పారాయణ చేశారు. అనంతరం అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో సాగుకు జీవం

- వాటి ఫలితాల ఆధారంగానే పోషకాల అంచనా
- కాకినాడ జిల్లాలో మట్టి నమూనాల సేకరణ లక్ష్యం 10 వేలు
- వీలైనంత త్వరగా ఫలితాలు అందించేలా వ్యవసాయశాఖ ఏర్పాట్లు



కరప మండలంలో మట్టినమూనా సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): భూమిలోని పోషకాలు, లోపాలను తెలుసుకుని అందుకు అవసరమైన విధంగా ఎరువులు వాడుతూ సాగు చేసినప్పుడే రైతులకు ఆశించిన ఫలితాలు వస్తాయి. ప్రస్తుతం చాలామంది రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో దిగుబడులు కోల్పోతున్నారు. రైతుకు తోచిన విధంగా వ్యవసాయం చేయడం, ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం, విచక్షణా రహితంగా మందులు, ఎరువులు వినియోగించడం, తదితర కారణాలతో వ్యవసాయంలో ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయశాఖాధికారులు, సిబ్బంది గ్రామాల్లోని రైతులకు భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టి నమూనా సేకరణ, పరీక్షలు చేయించుకునే విధానం, వాటి ఆధారంగా పంటలు సాగు చేసే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మట్టి నమూనాల సేకరణకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు కోరుతున్నారు.

**మట్టి నమూనాల సేకరణ విధానం**

భూమిలో రకాలను బట్టి ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకూ ఒక నమూనాను సేకరించవచ్చు. మట్టి నమూనాలను సేకరించాల్సిన భూమి రంగు, ఎత్తు, వాలును బట్టి చౌడు వంటి సమస్యలను కూడా దృష్టిలో ఉంచుకొని భాగాలుగా విభజించాలి. వేరు చేసిన భాగాలను వేరువేరు భూములుగా గుర్తించి ప్రతీ భాగం నుంచి వేరువేరు నమూనాలు సేకరించాలి. నమూనా తీయాల్సిన చోట చెత్తాచెదారం లేకుండా చేతితో పక్కకు తోయాలి. నాగలి సాలు పోయేంత వరకు ఆరు అంగుళాల లోతు మేర వీ ఆకారంలో తవ్వాలి. ఇలా తవ్విన గుంతలో నంచి అరకేజీ వరకూ మట్టి సేకరించాలి. మొత్తం మట్టిని కలిపి వాటిలో ఉండే రాళ్లు, వేర్లు, కొయ్యలు, చెత్తను శుభ్రం చేసుకోవాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత మొత్తం మట్టిని నాలుగు భాగాలుగా ఉంచి రెండు భాగాలు తీసివేయాలి. మిగిలిన రెండు భాగాల్లో అరకేజీ వరకూ ఉంచుకోవాలి. ఈ మట్టిని శుభ్రమైన సంచిలోగానీ, గుడ్డ సంచిలోకానీ నింపుకోవాలి. రైతు పేరు, సర్వే నంబర్, ఊరు, వంటి వివరాలు రాసి అందులో ఉంచాలి.

**వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా భూసార పరీక్షా కేంద్రాలకు..**

గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వారీగా సేకరించిన మట్టి నమూనాలను ఆయా సిబ్బంది సమీపంలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపుతారు. వీటిని ప్రయోగశాలల్లో పరీక్షించిన అనంతరం ఫలితాలను రైతులకు కార్డుల రూపంలో అందిస్తారు. పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బట్టి పొలాల్లో నెలకొన్న సమస్యలు, అనుసరించాల్సిన పద్ధతులు, ఎరువుల మోతాదులు, ఇతర వివరాలను సంబంధిత వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు తెలియజేస్తారు.


**మట్టి నమూనా సేకరించకూడని ప్రాంతాలు**

మట్టి నమూనాలు సేకరించాల్సిన పొలంలో గట్టు, నీడ, చవుడు వంటి ప్రదేశాలను గమనించాలి. చెట్ల నీడ, బురద ఉండే ప్రదేశాలు, తేమగా ఉన్న చోట నమూనాలు సేకరించకూడదు. పొలం గట్లు, ఎరువు కుప్పలు, పైరుకు దగ్గరగా నమూనాలు తీయకూడదు. సున్నం, బూడిద, రసాయన ఎరువులు వేసిన మూడు నెలల వరకూ తీయకూడదు. ఈ జాగ్రత్తలు తీసుకొంటే భూసార పరీక్షలు కచ్చితంగా వస్తాయి.

**ఆర్బీకే పరిధిలో మట్టి నమూనాలు**

జిల్లాలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలోను మట్టి నమూనాలు సేకరించే విధంగా వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 10 వేలు మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకూ ఎనిమిది వేల నమూనాలు సేకరించారు.

### నేలను కాపాడుకోవాలి



ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నేల ఆరోగ్యంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటాం. మట్టి పరీక్షల ఆధారంగా రైతులు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. పెట్టుబడులు కూడా బాగా తగ్గుతాయి. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మట్టి నమూనాలు సేకరించే విధంగా చర్యలు తీసుకొంటున్నాం.

–ఎస్ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి

# పిడుగు ప్రాణాంతకం సుమా!

- కాలంతో సంబంధం లేకుండా వర్షాలు.. ఉష్ణోగ్రతల్లో మార్పు
- ఉరుములు, పిడుగులతో అప్రమత్తం
- అజాగ్రత్త ప్రాణానికే ముప్పు రావచ్చు



**రాయవరం:** వేసవి పూర్తి కాక ముందే అకాల వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించబోతున్నాయి. ఒకేరోజు తీవ్రమైన ఎండలు, అంతలోనే భారీ వర్షాలు.. విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో వస్తున్న మార్పులతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎండ వేడితో అల్లాడిన ప్రజలు వానలు, వర్షాలు అనేటప్పటికి సరదా పడడం, వానలో చిందులేయడం సహజం. అంతవరకు బాగానే ఉన్నా ఈ సరదాలో మునిగి అప్రమత్తతను మరువకూడదు. విపరీత వాతావరణ పరిస్థితుల్లో ఎప్పుడు ఏ రకం వానలు కురుస్తాయో తెలియని పరిస్థితి. భారీ వర్షాలు కురిస్తే వాటితోనే ఉరుములు, మెరుపులు, పిడుగులు సహజంగానే వస్తాయి. ఆ ఆందోళన కలిగించే పరిస్థితులను తేలిగ్గా తీసుకుని సరదాగా తడుస్తామంటే మూల్యం చెల్లించుకోక తప్పదు. పిడుగులకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులూ చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. అధికంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులే పిడుగుపాటుకు సమిధలుగా మారుతుంటారు. పిడుగు పడే ప్రాంతాలపై విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా.. నష్టం జరుగుతూనే ఉంది. అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**పిడుగు అంటే:**

ఆకాశం కారుమబ్బులతో నిండినప్పుడు మబ్బు పైభాగంలో ధన శక్తి, కింది భాగంలో రుణ శక్తి ఉంటాయి. ఈ రెండు ఆకర్షణకు లోనై అత్యధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. చుట్టూ ఉన్న గాలిలో సుమారుగా 30 వేల డిగ్రీల సెంటీగ్రేడ్ ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపు. ఇలా వేడెక్కిన గాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే అదే ఉరుము. ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతుంది. దాన్నే పిడుగు అంటారు. చర్మం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గర్లో లోహ వస్తువులు ఊగుతున్నా పిడుగుపాటుకు సంకేతంగా భావించాలి.

**మిలియన్ మెగావాట్ల శక్తి**

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లకూడదు. మెరుపు లేదా పిడుగు కాంతిని చూసే ప్రయత్నమూ చేయకూడదు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

**సమయస్ఫూర్తి అవసరం**

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ వీలుకాకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి.. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవడం వలన సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అన్పించినప్పుడు రబ్బర్ చెప్పులు ధరించడం మంచిది. ఒక వేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా అనించకుండా, కాలివేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

**విద్యుత్ పరికరాలకు నష్టం**

పిడుగుపడినప్పుడు విద్యుత్ పరికరాలకు ఎక్కువ నష్టం జరిగే అవకాశముంటుంది. ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించక పోవడం ఉత్తమం.

### ఈ జాగ్రత్తలు పాటించాలి

- సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపైనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. అందుకే వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఎత్తైన చెట్లు, సెల్‌టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.
- కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, విద్యుత్ స్టవ్‌లు, ఇతర విద్యుత్తు పరికరాలు ఉపయోగించరాదు.
- వర్షం కురిసినప్పుడు విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
- ఉరుములతో కూడిన వర్షం వస్తున్నప్పుడు నీటితో కూడిన పనులు చేయరాదు.
- గుంపులుగా ఉండకుండా దూరంగా ఉండాలి.
- ముఖ్యంగా పొలాల్లో పనిచేయడం, పశువులను మేపడం, చేపలు పట్టడం వంటివి చేయరాదు.
- ప్రయాణాలు చేయకపోవడం మంచిది.
- చెరువులు, ఈతకొలనుల వంటి బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- పిడుగు పడిన సందర్భాల్లో ముఖ్యంగా శరీరంపై కాలిన గాయాలు కావడం, గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు కూడా విన్పించకపోవడం జరుగుతుంది. అటువంటివి జరిగినపుడు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

అలాగే మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయరాదు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు అధికం.

### అప్రమత్తత అవసరం



వర్షాలు కురుస్తున్న సమయంలో ఎత్తైన ప్రదేశాలకు, చెట్ల కిందకు వెళ్లరాదు. పిడుగు పడే సమయంలో బహిరంగ ప్రదేశంలో భూమిపై కూర్చోవాలి. కూర్చున్న సమయంలో చెవులు మూసుకోవాలి. ధ్వని శబ్దం గుండెకు చేరకుండా జాగ్రత్తపడాలి. సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి. సెల్‌ఫోన్స్ వాడకూడదు. వీలైనంత త్వరగా ఇళ్లకు చేరుకోవాలి. జాగ్రత్తల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు ఉంటుంది.

– డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్యాధికారి, అమలాపురం

### ముట్టుకుంటే షాక్ కొట్టదు



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని ముట్టుకుంటే షాక్ కొట్టదు. పిడుగులు పడే సమయంలో విద్యుత్ పరికరాల కనెక్షన్ తీసివేయడం మంచిది. ఈ సమయంలో కరెంటు మోటార్ల వద్దకు వెళ్లి పనులు చేయకూడదు. పిడుగుపాటుకు గురైన వ్యక్తికి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి.

– వై.విజయానంద్, ఈఈ, ఈపీ డీసీఎల్, రామచంద్రపురం డివిజన్

### మూగజీవాలను కాపాడాలి



మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నప్పుడు రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ పరిస్థితులను బట్టి వెంటనే అప్రమత్తం కావాలి. పశువులు, ఇతర జీవులను చెట్ల కింద ఉంచకూడదు. రైతులు సైతం చెట్లకు దూరంగా ఉండాలి. పలు సందర్భాల్లో పశువులు, పాడి రైతులు కూడా మృత్యువాత పడుతున్నారు.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డీడీ, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

## క్లుప్తంగా

### వాయునందనునికి కదలీ బంధనం



అరటిపళ్ల అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** రాజమహేంద్రవరం ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో కొలువై ఉన్న ప్రసన్నాంజనేయస్వామివారి ఆలయం 30 జయంతోత్సవం సందర్భంగా ఆదివారం స్వామి వారిని అరటిపండ్లతో అలంకరించారు. స్వామివారిని ఆలయకమిటీ ఆధ్వర్యంలో అరటిగెలలు, అరటిహస్తాలు, అరటిపండ్లతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వర్తకులు, రైల్వే ఉద్యోగులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా చదరంగం పోటీలు

**ప్రకాశం నగర్:** కాల్ఫ్యూషన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వేసవి శిక్షణ శిబిరంలో సుమారు నెల రోజుల పాటు శిక్షణ తీసుకున్న అండర్– 6 నుంచి అండర్ 18 వరకు సుమారు 170 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 5 రౌండ్లలో జరిగిన ఈ పోటీల్లో 55 మంది విజేతలకు బహుమతులు అందజేశామని అకాడమీ డైరెక్టర్ కుమార్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికీ ప్రశంసాపత్రం, పతకాన్ని అందజేసినట్లు తెలిపారు.

### మృతదేహం ఆచూకీ లభ్యం

**కరప:** మండలం నడకుదురు సమీపంలో లభ్యమైన వద్ధుని మృతదేహం ఆచూకీ లభ్యమైనట్టు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. వివిధ వార్తా పత్రికలలో పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం అనే శీర్షికన వెలువడిన కథనానికి బంధువులు స్పందించి కరప పోలీసుస్టేషన్‌లో సంప్రదించడంతో వివరాలు తెలిసాయన్నారు. మృతుడు పాలెపు ధనరాజు(78) కాకినాడలోని అన్నమ్మఘాటీకి చెందినవాడని, ప్రస్తుతం మహాలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నట్టు బంధువులు వివరించి, ఆధార్‌కార్డు చూపించారన్నారు. బంధువుల నుంచి అన్ని వివరాలు తీసుకుని, ధనరాజు మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

# వ్యక్తి దారుణ హత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు



మొగలి సతీష్ (ఫైల్)

**ప్రత్తిపాడు రూరల్:** వ్యక్తిని హతమార్చి మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ఘటన మండలంలోని ఒమ్మంగిలో చోటు చేసుకుంది. దాదాపు నెల రోజుల తర్వాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగలి సతీష్ (33)కి మండలంలోని ఒమ్మంగి గ్రామానికి చెందిన విజయకుమారితో పదేళ్ల క్రితం వివాహం అయింది. అనంతరం అత్తగారి ఊరైన ఒమ్మంగికి కాపురానికి వచ్చాడు. గత నెల 4న సతీష్ అదృశ్యమయ్యాడు. భార్య విజయకుమారి మే 6న తన భర్త కనిపించడం లేదని ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సతీష్‌ను తోడల్లుడు బుర్రా దొరబాబు మండలంలోని ధర్మవరం పోలవరం కాలువ వద్ద హతమార్చి మృతదేహాన్ని ఉత్తరకంచి – పాండవులపాలెం సమీపంలో పూడ్చిపెట్టినట్లు తెలిసింది. ప్రత్తిపాడు సీఐ శేఖర్ బాబు, ఎస్సై పవన్‌కుమార్, తహసీల్దార్ నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించారు. వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుడి ద్విచక్ర వాహనాన్ని శంఖవరం మండలం పెదమల్లాపురం సమీపంలో మే 9న దగ్ధం చేశారు. మృతుడికి పెదమల్లాపురానికి చెందిన యువతితో వివాహేతర సంబంధం ఉండటంతో హత్యను ఆమె వైపు మళ్లించేందుకే ఈ వాహనాన్ని ఆ ప్రాంతంలో దగ్ధం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

### పాము కాటుకు మహిళ మృతి



తాతపూడి మేరీ (ఫైల్)

**సామర్లకోట:** స్థానిక భీమవరపు కొత్తపేటలో ఆదివారం పాము కాటుకు ఒక మహిళ మృతి చెందింది. తెల్లవారు జామున తాతపూడి మేరీ (47) ఇంటి ముంగిట ఉన్న వాకిలి శుభ్రం చేస్తున్న సమయంలో ఏదో కుట్టినట్లు కావడంతో లెక్క చేయకుండా ఇంటిలోనికి వెళ్లింది. అయితే కాలు నెప్పి ఎక్కువ కావడంతో ఆమె కేకలు వేయడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లారు. ఆస్పత్రి వైద్యుడు ఆమెను పరీక్షించి పాము కాటు వేసిందని, వైద్యం ప్రారంభించారు. చికిత్స పొందుతూ మేరీ మృతి చెందింది.

# రెండు బస్సులు ఢీ

- 29 మందికి గాయాలు
- వారిలో ఆరుగురికి తీవ్ర గాయాలు
- బొలెరోను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేటు బస్సు
- అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఘటన



ముమ్మిడివరం టోల్‌ప్లాజా వద్ద ఢీకొన్న బస్సులు

**ముమ్మిడివరం:** ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. అమలాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాకినాడ నుంచి అమలాపురం ప్రయాణికులతో వస్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు టోల్‌ప్లాజా వద్ద బొలెరో వేన్‌ను తప్పించబోయి అదుపు తప్పి బస్సును ఢీకొట్టింది. ఆర్టీసీ బస్సులో 25 మంది ప్రయాణికులు, డ్రైవర్ గాయపడగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులోని ఇద్దరు ప్రయాణికులు, డ్రైవర్ గాయపడ్డారు. ఘటన సమయంలో ఆర్టీసీ బస్సులో 70 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రైవేటు బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. మొత్తంగా గాయపడిన వారిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సులో గాయపడిన 12 మందిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిలో అంబాజీపేటకు చెందిన ఇ.రామసీత, కాకినాడకు చెందిన జి.శ్రీనివాస్, భీమవరానికి చెందిన డి.జాన్‌బాబు, గుత్తెన దీవికి చెందిన సీహెచ్ కృష్ణవేణి, అమలాపురానికి చెందిన ఎం.కుమార్ ఉన్నారు. మిగిలిన వారంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై డి.సురేష్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- ఏడుగురు ప్రయాణికులకు గాయాలు
- బస్సు డ్రైవర్ పరిస్థితి విషమం



దేవరపల్లి మండలం బందపురం వద్ద ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు

**దేవరపల్లి:** దేవరపల్లి మండలం బందపురం సమీపంలో గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపై ఆదివారం లారీని ప్రైవేటు బస్సు ఢీకొంది. విజయవాడ వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు సిమ్మెంట్ లోడుతో వెళుతున్న లారీని వెనుక నుంచి వస్తున్న కావేరీ ప్రవేట్ ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ జవ్వాది గోపి తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న తెప్పల షణ్ముఖరావు, కె.చంద్రశేఖర్, ఎం.చంద్రశేఖరరావు, పి.రవిశంకర్, ఆర్.సావిత్రి, ఆర్.కొండలరావు, బి.అనిత స్వల్పంగా గాయపడగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స చేశారు. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళుతున్న బస్సు జగ్గయ్యపేట నుంచి జగ్గంపేటకు సిమ్మెంట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీ కొన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

## ఆధారాలు లేని రూ.13.5 లక్షలు స్వాధీనం



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

**రాజమహేంద్రవరం సిటీ:** ఏ విధమైన బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.13.5 లక్షలను స్వాధీనం చేసుకుని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగించినట్లు రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై లోవరాజు తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నం అగ్రహారానికి చెందిన బొల్లా పేరయ్య ఉమా మహేశ్వర వర ప్రసాద్ రైలు నంబర్ 20834 వందే భారత్‌లో సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరం వరకు ప్రయాణిస్తున్నాడన్నారు. జీఆర్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ నగదు పట్టుబడిందని లోవరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ ఎస్సై విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కొవ్వూరు డీఎస్పీపై బదిలీ వేటు

- డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశం
- రాజమహేంద్రవరం సీసీఎస్ డీఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యత



డీఎస్పీ రామారావు

**కొవ్వూరు:** సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా కేశన చెంచు రామారావుపై బదిలీ వేటు పడింది. ఈయనపై పలు రకాల అవినీతి ఆరోపణలు రావడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆయన హుటాహుటిన డీజీపీ ఆఫీసుకి పయనమయ్యారు. గుంటూరులో దిశ వుమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న రామారావు ఫిబ్రవరి ఒకటో తేదీన కొవ్వూరు బదిలీపై వచ్చారు. నాలుగు నెలలు గడవక ముందే ఆయనపై బదిలీ వేటు పడడం చర్చనీయాంశం అయ్యింది. రాజమహేంద్రవరం సీసీఎస్ డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి ఆదివారం రాత్రి ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.

## వేంకటేశ్వర స్వామికి ఆభరణాల అందజేత



ఆభరణాలను అందజేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

**కాకినాడ రూరల్:** శ్రీవాగ్గేయకార మండప ద్వితీయ వార్షికోత్సవం మండలంలోని సర్పవరం గ్రామంలో భవాని సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాగ్గేయకార మండపం ముఖ మండపాన్ని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించారు. మండపంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారికి ఎన్నారై యండూరి నాగదీపక్ సమకూర్చిన ఆభరణాలను చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఆలయ కమిటీకి అందజేశారు. భవాని సమేత నీలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో భక్త బృందం పెద్దాడ సూర్యకుమారి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడుతున్న యువకుల అరెస్ట్



నిందితులను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేసిన పోలీసులు

- సొత్తు రికవరీ చేసిన పోలీసులు

**యానాం:** నియోజకవర్గ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి చేర్చి ఉన్న గణపతినగర్, నవాజ్‌గార్డెన్స్ ప్రాంతాల్లో మార్చి 19, మే ఒకటో తేదీల్లో ఇళ్లలో చోరీకి పాల్పడిన సీహెచ్ దుర్గాప్రసాద్, డొంకా వీరబాబులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి ఫ్రిజ్, ఎల్ఈడీ టీవీ, ల్యాప్‌ట్యాప్, గ్యాస్ సిలిండర్లు, వాషింగ్ మెషీన్, ఫ్యాన్ తదితర వస్తువులను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి యానాం సబ్ కోర్టుకు హాజరుపరచగా వారికి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు.

**గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్..**

నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు, విద్యాసంస్థలకు దగ్గరలోని దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్న వి.శివ అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి అతని వద్ద నుంచి వివిధ రకాల పొగాకు ఉత్పత్తులతో కూడిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు.

## ఓట్ల లెక్కింపు వేళ ట్రాఫిక్ మళ్లింపు

- తెల్లవారు జాము 4.30 గంటల నుంచే అమలు
- జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్

**అమలాపురం టౌన్:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం నిర్వహించనుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టింది. చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనున్న సందర్భంగా ఆ కళాశాల ఉన్న 216 జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను మళ్లిస్తూ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ ఆదివారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు ఆ రోజు తెల్లవారు జాము 4.30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మంగళవారం సాధ్యమైనంత వరకూ ప్రయాణాలు చేయవద్దని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందన్న విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని గుర్తు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కౌంటింగ్ ఏజెంట్లకు, కౌంటింగ్ సిబ్బందికి వేర్వేరుగా వాహనాల పార్కింగ్‌కు స్థలాలు ఏర్పాటు చేశామన్నారు.

**ట్రాఫిక్ మళ్లింపు ఇలా**

- కాకినాడ వైపు నుంచి అమలాపురం వైపు వచ్చే మోటారు సైకిళ్లు, ఆటోలు, కార్లు ముమ్మిడిరం కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు నుంచి ముక్తేశ్వరం మీదుగా అమలాపురం వెళ్లాలి.
- అమలాపురం వైపు నుంచి కాకినాడకు వెళ్లే మోటారు సైకిళ్లు, ఆటోలు, కార్లు అనాతవరం, మాగం, క్రాప చింతలపూడి నుంచి ముమ్మిడివరం కొండాలమ్మ చింత మీదుగా వెళ్లాలి.
- ముమ్మిడివరం పరిసర ప్రాంతాల్లోని వాహన చోదకులు చెయ్యేరు అడ్డపుంత నుంచి మహిపాల చెరవు మీదుగా అమలాపురం వైపు వెళ్లాలి.
- అనాతవరం, చెయ్యేరు వాహనచోదకులు మహిపాల చెరువు, పోతుకుర్రు, క్రాప గ్రామాల నుంచి ముమ్మిడివరం కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు మీదుగా కాకినాడ వైపు వెళ్లాలి.
- కాకినాడ వైపు నుంచి అమలాపురం వైపు, అమలాపురం నుంచి కాకినాడ వైపునకు ఎలాంటి భారీ వాహనాలకు అనుమతి లేదు.
- కాకినాడ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలన్నీ అన్నంపల్లి టోల్ గేట్ వద్ద, అమలాపురం వైపు నుంచి కాకినాడకు వెళ్లే భారీ వాహనాలు భట్నవిల్లి వై.జంక్షన్ వద్ద తెల్లవారు జాము 4.30 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకూ నిలిపి వేసేలా ఆంక్షలు విధించారు.